క్లుప్తంగా

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం



క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు

గచ్చిబౌలి: 67వ రంగారెడ్డి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌ను జిల్లా విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. శనివారం కొండాపూర్ చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, అండర్–17 కబడ్డీ స్కూల్ గేమ్స్‌లో 510 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎనిమిది జోన్లుగా విభజించి స్కూల్ గేమ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కోసం జట్టును ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో చిరాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇఫాత్ ఇబ్రహీం, శేరిలింగంపల్లి జోనల్ సెక్రటరీ భిక్షపతి, సుజన తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌గౌడ్‌కు ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న సాయిబాబా తదితరులు

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి మాజీ ఇన్‌చార్జీ కొండకల్ శంకర్‌గౌడ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో పలువురు శంకర్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ... బీఆర్‌ఎస్‌కు శేరిలింగంపల్లిలో బలమైన పునాదుల వేసిన ఘనత శంకర్‌గౌడ్‌కే దక్కుతుందని, ఆయన మాకు రాజకీయగురువు అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చెన్నంరాజు, దూరుగుపల్లి నరేష్, సతీష్, రమేష్‌గౌడ్, నారాయణ, అక్బర్, రాజుదిరాజ్, అశోక్, జగదీష్, భిక్షపతి, ఫయాజ్, అరుగ, రాణి, బాలమణి, మాధవి, లత, సుగుణ, తాహీర్, ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రసాయన పరిశ్రమలో నగరం కీలకం

సాక్షి, సిటీబ్యూరో: అగ్రో కెమికల్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ నగరంలోని కొండాపూర్‌లో ఉన్న ఏషియన్ సన్ సిటీలో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీనిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణులు మాట్లాడుతూ... దేశంలోని మొత్తం వ్యవసాయ రసాయన వ్యాపారంలో నగరంతో పాటు దక్షిణ మండలం 35 శాతం వాటాను కలిగి ఉందని వెస్ట్ జోన్‌కు సెంట్రల్ హబ్‌గా కూడా నగరం కీలక స్థానాన్ని కలిగి ఉందని వివరించారు.

పోటాపోటీగా గణేష్ లడ్డూల వేలం

- అపర్ణ సరోవర్ లడ్డూ రూ. 10.25 లక్షలు
- అపర్ణ గ్రాండే గణేష్ లడ్డూ రూ. 3.1 లక్షలు



అపర్ణ సరోవర్‌లో రాజేష్ వర్మ ఉద్దరాజు శాతిప్రియ దంపతులకు లడ్డూను అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: గణేష్ ఉత్సవాల్లో భాగంగా లడ్డూల వేలం పాట కొనసాగుతోంది. శనివారం శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట వేయగా సరోవర్‌వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అపర్ణ సరోవర్‌కు చెందిన రాజేష్ వర్మ ఉద్దరాజు, శాంతిప్రియ దంపతులు వేలంలో గణేష్ లడ్డూను రూ. 10.25 లక్షలకు దక్కించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు లడ్డూను అందజేశారు.

- నల్లగండ్ల అపర్ణ గ్రాండేలో గణేష్ లడ్డూను వేలంలో జీవన్‌రెడ్డి, రాధిక దంపతులు రూ. 3.01 లక్షలకు దక్కించుకున్నారు.



అపర్ణ గ్రాండేలో గణేష్ లడ్డూను దక్కించుకున్న జీవన్‌రెడ్డి రాధిక దంపతులు

మెరుగైన వసతులు కల్పించాం

- రూ. 6.69 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- చందానగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, నాలా కల్వర్టు పనులు
- అన్ని రంగాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో సుమారు రూ. 6.69 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని శివాజీనగర్, తారానగర్, ఇందిరానగర్, ఫ్రెండ్స్ కాలనీ, కైలాష్‌నగర్, కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, డిఫెన్స్ కాలనీ, వెంకటేశ్వర నగర్, మారుతి ఎన్‌క్లేవ్, న్యూ శంకర్‌నగర్, భవానీ నగర్ కాలనీలలో నూతనంగా సీసీ రోడ్లు, నాలా కల్వర్టు నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధి పనుల చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి పని చేస్తుందన్నారు. కాలనీలలో ప్రజలకు కావలసిన కనీస మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సంక్షమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సీఎం కెసిఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా కోసం రోడ్లన్ని అభివృద్ధి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ సుబ్బారెడ్డి

మాదాపూర్: సీజన్లు మారుతున్న కొద్దీ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరుగుతున్నాయని.. వాటి పట్ల ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రఖ్యాత ఇంటెన్సివ్ కేర్ వైద్యుడు డాక్టర్ సుబ్బారెడ్డి హెచ్చరించారు. మాదాపూర్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సాధారణ జలుబు, జ్వరంకు కూడా యాంటీబయాటిక్స్ తీసుకోవడం రోగులకు అలవాటుగా మారిందన్నారు. ఈ తరహా వైద్యం ఆరోగ్యంపై ప్రతికూల చర్యలకు ఉపకరిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంద్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణ రూపు మార్చుకున్నప్పుడు రోగి మందులకు ప్రతిస్పందించడంలో విఫలమైనప్పుడు యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్సీ ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కల్పించారు.

2న 'రన్ ఫర్ పీస్'

- రిజిస్ట్రేషన్‌కు రేపు ఆఖరు



సాక్షి, సిటీబ్యూరో: బొటానికల్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ నిర్వహించనున్న రన్ ఫర్ పీస్ మూడంచెల పరుగు పోటలకు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ జి.చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. శనివారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్స్‌లో జరిగిన బ్రోచర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ... అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే పరుగు పోటీల్లో నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బొటానికల్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా భరత్ రెడ్డి మాట్లాడుతూ... 3కే, 5కే, 10కే కేటగిరీల్లో పరుగు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్స్‌కు సోమవారమే ఆఖరు తేదీ అని చెప్పారు. రన్ ఫర్ పీస్‌లో దాదాపు 5 వేల మంది పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఏవీ రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి పి.బాలకిషన్‌రావు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారాంలో నిర్వహిస్తున్న బీహార్ కనెక్ట్ 2023 చేనేత హస్తకళ మేళాలో భాగంగా శనివారం సందర్శకులు అధిక సంఖ్యలో సందర్శించారు. చేనేత హస్త కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను కొనుగోలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విజయవాడకు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి స్వర్ణలత శిష్య బృందం నాట్యంతో అలరించారు. ఇందులో లక్ష్మీప్రవేశం, రుక్మిణి ప్రవేశం, శివపంచాక్షరీ, జతిస్వరం, దశావతార శబ్దం, మండూక శబ్దం, మరకతమణిమయ, కులవై ఉన్నాడే, అన్నమాచార్య కీర్తనలను అలపించి అలరించారు. బెంగుళూరుకి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి శిల్ప అభిరాం తన ప్రదర్శనతో అలరించిది. ఇందులో అర్ధనారీశ్వర భజన్ అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉస్మాన్‌నగర్‌లో నివాసం ఉండే ప్రమోద్ (47) ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 19న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రమోద్ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ శాశ్వత ప్రాతిపదిక పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని వెంకట్‌రెడ్డికాలనీలో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ సీసీ రోడ్డు పనులను సంబంధిత అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు డ్రైనేజీ సమస్యలు లేకుండా చేయాలని దశలవారీగా అన్ని కాలనీలు, బస్తీలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు వేసిన తర్వాతనే డ్రైనేజీ కాలువల పనులను చేపట్టాలని, ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని ఆయన సూచించారు. చేపట్టిన ప్రతి పనిలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారని గుర్తు చేశారు.



వెంకట్‌రెడ్డికాలనీలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్.....

శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్ లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. అక్కడ ప్రతియేటా వర్షాకాలంలో తలెత్తే సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు. నాలా కల్వర్టు, వరదనీటికాలువ నిర్మాణం చేస్తున్నారని గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, జయంత్‌కుమార్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, సుభాష్‌రాథోడ్, అశోక్, రమణగౌడ్, మధుగౌడ్, అజర్, కాలనీవాసులు పాల్గొన్నారు.



వైభవంగా గణేష్ నిమజ్జనం

గచ్చిబౌలి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గచ్చిబౌలిలోని ఐడీబీఐ బ్యాంకు బసారా క్వార్టర్స్‌లో శనివారం నిమజ్జనోత్సవ సంబరాలు ఆకాశాన్నంటాయి. సుమారు రెండొందల మంది బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన దాండియా చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

మార్కెట్‌లోకి అడ్వాన్స్‌డ్ ఎంబ్రాయిడరీ మిషన్

లీ మెరిడీయన్‌లో ప్రారంభించిన సినీ నటి శ్రియ శరణ్

గచ్చిబౌలి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే హెచ్‌ఎస్‌డబ్ల్యూ 5జీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంబ్రాయిడరీ మిషన్ సినీ నటి శ్రియ శరణ్ ప్రారంభించారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరిడీయన్ హోటల్‌లో హెచ్‌ఎస్‌డబ్ల్యూ 5జీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంబ్రాయిడరీ మిషన్‌ను ఆమె మార్కెట్‌లోకి విడుదల చేశారు. హెచ్‌ఎస్‌డబ్ల్యూ సీఈఓ తపన కపాడియా... మాట్లాడుతూ మహిళలకు మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ ఎంబ్రాయడరీ మిషన్ దోహదం చేస్తుందన్నారు.



ఎనిమిది దేశాలలో, 22 రాష్ట్రాలలో మహిళలకు అందుబాటులోకి తీసుకోస్తున్నామని ఆయన ప్రకటించారు. సరికొత్త డిజైన్లను రూపొందించి మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సినీ నటులు సుధీర్ రాగని, వై.విజయమ్మ, గిరేషన్ తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థిని శిల్పకు డాక్టరేట్

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారంలోని గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని శిల్పా సొల్లేటిని డాక్టరేట్ వరించింది. 'మెక్రోస్ట్రక్చర్స్‌తో ద్రవాల ప్రవాహం.. థర్మోడైనమిక్ విశ్లేషణ' అంశంపై ఆమె అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినట్లు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వంశీకృష్ణ నార్ల తెలిపారు. శిల్పా సొల్లేటి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి నాగేష్, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా తదితరులు అభినందించారు.

తాడు గొంతుకు బిగుసుకుపోయి...బాలుడి మృతి

హఫీజ్‌పేట్: తాడుతో ఆడుకుంటూ గొంతుకు బిగుసుకుపోయి బాలుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం చందానగర్ భవానీపురం వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉండే బిస్సు కర్మ రాంజీ కార్పెంటర్ పని చేస్తుంటాడు. అతని కుమారుడు బిస్సు కర్మ కృనాల్(12) ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం 7 గంటలకు రాంజీ భార్యకు ఛాతిలో నొప్పి రావడంతో హాస్పిటల్‌కు వెళ్లి వస్తామని చెప్పి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కృనాల్ దుస్తులు ఆరవేసే తాడుతో ఆడుకుంటుండగా..అది ప్రమాదవశాత్తు గొంతుకు చుట్టుకుపోయి ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యాడు. ఇంటి పక్కన ఉన్న వారు గమనించి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పగా వారు వెంటనే ఇంటికి చేరుకుని బాలుడ్ని సమీపంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు భవానీపురం వెళ్లి ఘటన జరిగిన తీరును బాలుడి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



శేరిలింగంపల్లిలో గణనాథుల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



నల్లగండ్లలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్

ఘనంగా గణేష్ ఉత్సవాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: గణేష్ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వినాయకచవితి పర్వదినం సందర్భంగా ప్రతిష్టించిన గణనాథులకు ఉదయం, సాయంత్రం వేళల్లో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో ప్రతిష్టించి వినాయకులకు నిత్య పూజలను నిర్వహిస్తున్నారు. పలు చోట్ల నిత్య అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.



గంగారంలో సాయి ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో...



శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నేత రఘునాథ్‌యాదవ్ తదితరులు